**72**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** తీర్థయాత్రల నుంచి కాకతి తిరిగి వచ్చినట్టు జాయప చెవిన వేశాడు అంకమరట్ట. ఆమె అనుమకొండలోనే ఉంది, పద్మాక్షి దేవాలయంలో రంగపూజనం నిర్వహిస్తున్నట్లు కూడా చెప్పాడు. దాంతో.. ప్రత్యూషవేళ పద్మాక్షి దేవాలయానికి వెళ్లాడు జాయపుడు. పూజాదికాలు ముగించుకుని గుడి బయటికి వచ్చిన రేణుకకు, కాకతికి ఎదురుగా కనిపించాడు. సాక్షాత్తూ మన్మథుడే ఎదుట నిలిచినట్టు ఉన్న జాయపుణ్ని చూసి.. రెప్పవేయడం మర్చిపోయింది రేణుక. కాకతి ఆమెను కదిపింది.

“మా నాట్యబృందంలో నటిస్తాడని చెప్పానే.. జాయపుడు. ఇతగాడే!” చాలా చిన్నస్వరంతో, ఏదో సాధారణ నటుడు అన్నట్లు రేణుకతో చెప్పింది కాకతి.

రేణుక జాయపుణ్ని అలా చూస్తూనే.. అతని దగ్గరికి వెళ్లింది. గౌరవంగా గుర్రం దిగాడు.

“ఈ పిల్ల ఎప్పుడూ మీ నామధేయమే కలవరిస్తూ ఉంటుంది. ఈ వెనుకవీధిలోనే మా ఇల్లు. రండి!”.

కాకతికి చిర్రెత్తుకొచ్చింది.

జాయపునితో మాట్లాడింది గాక.. ‘మీ నామధేయమే కలవరిస్తుంది’ అని చెబుతుందా!? ఛ ఛ.. పరువు తీసేసింది.

కానీ, తను చేయగలిగింది ఏమీ లేదు. జాయపుణ్ని చూస్తే ఏ ఆడదైనా అంతే! ఇద్దరూ గృహోన్ముఖులవగా.. వెనుక గుర్రంపై జాయపుడు. మరి కాసేపటికి రేణుక ఇంటికి చేరారు. భైరి నాయకుడు, రేణుక గొప్ప అతిథి మర్యాదలు చేశారు.

అయ్యన్నవోలుకు చెందిన సైనికుడు భైరినాయకుడు. అనుమకొండలో నివాసం. ఆయన భార్య రేణుక. కేశవ స్వామి దేవాలయంలో గుడిసాని. ఆమె తండ్రి గుడి అంగరంగభోగానికి ఇచ్చిన దానం గుడిలో సక్రమంగా జరిగేలా చూస్తూ.. పూజారితో కలిసి నిత్యమూ గుడి అంగరంగ భోగాలన్నీ నిర్వహిస్తుంటుంది. అందుకు ఆమె గుడిసానిగా గుర్తింపు పొందింది. వెన్నియకు ఆమె దూరపుబంధువు కావడంతో వారి నివాసంలో ఉంటూ గురుకులంలో నాట్యాభ్యాసం చేస్తున్నది కాకతి.

నాట్యగురుకులంలో మాత్రమేకాదు.. ఏ గురుకులంలో అయినా ఉచిత నివాస, భోజన వసతులు ఉంటాయి. అయితే దేవునికి అంగరంగసేవలు కాకతికి నిర్వహించడం ఎంతో ఇష్టం. అందుకే భైరినాయకుని ఇంట్లో ఉంటూ.. నాట్యం అభ్యసిస్తున్నది.

కాకతి, జాయపుని మధ్య ఒక్కమాట కూడా లేదు. కేవలం కన్నుల బాసలే. అందులో ఎన్నో గ్రంథాలు.. ఎన్నెన్నో ప్రబంధాలు.. ఇంకెన్నో విరహగీతాలు.. మరెన్నో మధురిమల లేలేత గాయాల వేదనలు!

జాయపునికి సగౌరవ వీడ్కోలు ఇచ్చారు. అశ్వాన్ని అధిరోహించాడు.. కానీ, విక్రమ ఇష్టం లేనట్లు మెల్లగా పోతున్నది. కాస్తదూరం వెళ్లి.. డొంక మలుపువద్ద వెనక్కి తిరిగి చూశాడు.

అతని చూపుల కోసమే నిరీక్షిస్తున్నట్లు.. అతను చూడగానే చేతులతో నమస్కార నాట్యభంగిమపెట్టి, లోపలికి మాయమైంది కాకతి. అప్పుడందుకున్నాడు వేగం విక్రమ.. యజమాని మనసులో ఉరకలు వేస్తున్న ఉత్సాహం లాంటిదేదో గుర్తించినట్లున్నాడు.

* * *

గుండయామాత్యుని గురుకులం.. మరునాడు కాకతి కోసం ఎదురుచూస్తున్నాడు జాయపుడు.

అయ్యన్నవోలు నుంచి వీడ్కోలు తీసుకుంటున్న సన్నివేశం గుర్తొచ్చింది.

ఆవేళ కాకతి చాలా ఉద్విగ్నురాలయ్యింది. ఇంట్లో ఏడ్చిఏడ్చి వచ్చినట్లు.. జాయపుని ముందు ఏడవకూడదని నిశ్చయించుకున్నట్లు స్థిరంగా ఉంది.